ఈ దుర్గంధం భరించాల్సిందేనా?

- బృందావనం గార్డెన్స్‌లో అధ్వానంగా పారిశుధ్యం
- దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థ
- పార్కు స్థలంలో చేరుతున్న మురుగు
- చెరువును తలపిస్తూ దోమలు, పాములకు ఆవాసం
- సమస్యను పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

➡ ఈ చిత్రంలో కనిపిస్తోంది చెరువు అనుకుంటే పొరపాటే. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్, బృందావనం గార్డెన్స్‌లో పార్కుకు కేటాయించిన స్థలం. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో పార్కు స్థలంలో మురుగు చేరుతోంది. చెరువును తలపిస్తూ దోమలు, పాములకు ఆవాసంగా మారింది. మురుగు కారణంగా పరిసరాలు దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మురుగుతో చెరువును తలపిస్తున్న పార్కు స్థలం



బృందావనం గార్డెన్స్‌లో పారని మురుగునీరు

నెల్లూరు సిటీ : రూరల్ పరిధిలోని రెండో డివిజన్ బృందావనం గార్డెన్స్ వాసులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కాలనీలో దాదాపు 200 కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్నాయి. రెండు అపార్ట్‌మెంట్లు సైతం ఉన్నాయి. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. లేఅవుట్ నిర్మాణ సమయంలో సమీపంలోని కొత్తకాలువలోకి మురుగు వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఇది దెబ్బతినడంతో కొత్త కాలువలోకి మురుగు వెళ్లడం లేదు. పార్కు కోసం కేటాయించిన స్థలంలో మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాకాలంలో పార్కు స్థలం నిండితే డ్రైనేజీల్లోనే మురుగు నిల్వ ఉండి ఇళ్లలోకి దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో గృహాల్లో నివాసం ఉండలేక కొందరు అమ్మేసుకుని వెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి.

పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

బృందావనం గార్డెన్స్‌లో ఎక్కువగా ఉద్యోగులే నివాసం ఉంటున్నారు. డ్రైనేజీ సమస్యను స్థానికులు కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. కాలనీ సమీపంలోనే అండర్ డ్రైనేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఉంది. మురుగును అక్కడకు మళ్లించే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నిర్మాణ వ్యయాన్ని సాకుగా చెబుతూ తప్పించుకుంటున్నారు. ఓ వైపు నగర పాలకసంస్థ పరిధిలో పారిశుధ్యానికి పెద్దపీట వేసి నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పదేపదే సమావేశాల్లో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల తీరుమాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. నగరంలో తప్ప రూరల్ నియోజకవర్గ పరిధిలో పారిశుధ్యాన్ని పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల తనిఖీలు అంతంత మాత్రంగా ఉండడంతో మొక్కుబడిగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు.

దోమలు, పాములకు ఆవాసంగా పార్కు స్థలం

బృందావనం గార్డెన్స్ లేఅవుట్ నిర్మాణ సమయంలో పార్కు కోసం దాదాపు ఎకరా స్థలాన్ని కేటాయించారు. మూడు, నాల్గో మైలు ప్రాంతంలో ఎటువంటి పార్కులు లేవు. లేఅవుట్‌లోని ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని స్థానికులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ప్రస్తుతం డ్రైనేజీ దెబ్బతినడంతో మురుగు పార్కులో చేరి చెరువును తలపిస్తూ దోమలు, పాములకు ఆవాసంగా మారింది.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. దీనివల్ల పార్కు కోసం కేటాయించిన స్థలంలో మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాకాలంలో పార్కు స్థలం నిండి అందులోకి మురుగు వెళ్లక ఇళ్ల ముందే నిల్వ ఉండి దుర్గంధం వ్యాపిస్తోంది. మున్సిపల్ అధికారులకు పలుమార్లు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సాయి, బృందావనం గార్డెన్స్

పార్కును నిర్మించాలి

బృందావనం గార్డెన్స్ లేఅవుట్ నిర్మాణ సమయంలో పార్కు, ఇతర అవసరాల కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. మూడోమైలు, నాల్గో మైలు ప్రాంతంలో పార్కులు లేనందున ఈ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ప్రస్తుతం పార్కు స్థలం మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించి పార్కును ఏర్పాటు చేయాలి.

– కృష్ణారెడ్డి, బృందావనం గార్డెన్స్

క్లుప్తంగా

ఘనంగా ఘంటసాల జయంతి



నెల్లూరు(బృందావనం) : గాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని పుర మందిరంలో గాయకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన తబలిస్ట్ ఎం.శాంతికుమార్‌ను సన్మానించారు. విశ్రాంత ఎస్పీ మూర్తితో కలిసి నీలకంఠం శ్రీనివాసులురెడ్డి 103వ పర్యాయం రక్తదానం చేశారు. సీనియర్ గాయకులు ఆకుతోట రమణయ్య, సుజాత, ప్రసాద్‌బాబు, లక్ష్మి, పెంచలరెడ్డి, రామచంద్రరావు ఆలపించిన ఘంటసాల గీతాలు అలరించాయి. అనంతరం ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఆఫీసర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు పిన్ను గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

నెల్లూరు(బృందావనం) : కార్తీకమాస దీపారాధన యోగసాధనకు ప్రతి రూపమని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు నగర కమిటీ అధ్యక్షుడు డి.సూరమౌళి తెలిపారు. కార్తీక మాసం చివరి రోజును పురస్కరించుకుని కిసాన్‌నగర్, ప్రశాంతినగర్, బీఎస్నార్ తదితర ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక దీప విశిష్టతను వివరించారు. ఇంటింటికీ త్రైత సిద్ధాంత భగవద్గీతను అందజేశారు. ఈ కార్యక్రమంలో సునీల్, ధనలక్ష్మి, అవినాష్, అన్నపూర్ణ, మహేంద్ర, డీవీ ప్రసాద్, కావ్యశ్రీ, శ్రీదేవి, రమాదేవి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లేక కాలనీల్లోకి నీరు



నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సిమెంట్‌రోడ్లు నిర్మించిన ప్రాంతాల్లో సైడు కాలువలు లేకపోవడంతో పలు కాలనీలు నీట మునిగిపోతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో నీట మునిగిన ప్రాంతాలను ఆయన ఆదివారం పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్పొరేషన్ అధికారులు స్పందించి మోటార్ల ద్వారా వర్షపు నీటిని బయటకు పంపాలని, నీరు నిల్వ లేకుండా ఉండేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆయన వెంట నరసింహ, పెంచలయ్య ఉన్నారు.

జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ కార్యవర్గం ఏర్పాటు



నెల్లూరు(అర్బన్): ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నెల్లూరు వేదాయపాళెంలోని ఎంపీఎస్ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరు డీఆర్వో కె.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆమంచర్ల సెక్షన్ అధికారి ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా సైదాపురం ఎఫ్‌బీఓ పి.రవిశేఖర్, నిర్వహణ కార్యదర్శిగా కావలి సెక్షన్ అధికారి ఆర్.సుమన్, సంయుక్త కార్యదర్శిగా సూళ్లూరుపేట ఎఫ్‌బీఓ ప్రసన్నకుమార్, కోశాధికారిగా రాపూరు ఎఫ్‌బీఓ సలీంను ఎన్నుకున్నారు. అనంతరం వీరు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఐక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

వృద్ధుడి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు నక్కలోళ్ల సెంటర్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై ఆదివారం జరిగింది. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ బనియన్, బులుగు, ఆకుపచ్చ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభినందన



నెల్లూరు(బృందావనం) : గౌరవ డాక్టరేట్ పొందిన సయ్యద్ సమీ హుస్సేనిని చిన్నబజారులోని ఖాజా పీర్ దర్గాలో ఆదివారం సన్మానించి అభినందించారు. నిర్వాహకుడు బాబా సాహెబ్ బంద్ నవాజ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సమీ హుస్సేని అందించిన సేవలను గుర్తించి అమెరికా గ్లోబల్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సయ్యద్ సాలా తదితరులు పాల్గొన్నారు.

‘తెలుసుకో సీమచరిత్ర’ పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం) : ప్రవాస భారతీయుడు పెను పుట్టా రచించిన ‘తెలుసుకో సీమ చరిత్ర శతకం’ పుస్తకావిష్కరణ పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆదివారం రాత్రి పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు మాట్లాడుతూ స్థానిక గండిపాళెంలోని ఏపీఆర్ఎస్ పూర్వ విద్యార్థి అయిన పెను పుట్టా అమెరికాలో ఉంటూ తెలుగు భాషా, నేలపై ఉన్న మమకారంతో తనలోని భావాలను వ్యక్తీకరించడం హర్షణీయమన్నారు. అనంతరం రచయితను సన్మానించారు. పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఈతకోట సుబ్బారావు, ఎ.శ్రీధర్‌బాబు, బత్తిన సాయికుమార్‌రెడ్డి, ఇంద్రగంటి మధుసూదన్, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు బిర్సా ముండా



బహుమతుల ప్రదానోత్సవంలో మేయర్ స్రవంతి

- మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు) : గిరిజన యోధుడు బిర్సా ముండా ఆదర్శప్రాయులు అని నగర మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్పగుడి సమీపంలోని గుర్రం బాబయ్య కల్యాణ మండపంలో వ్యాసరచన పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. తొలుత మేయర్ జ్యోతి ప్రజ్వలన గావించారు. బిర్సా ముండా, వెన్నెలకంటి రాఘవయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. బిర్సా ముండా జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు దాదాపు 400 మందికిపైగా విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కార్తీక్, పి.లక్ష్మి, కె.గాయత్రిలకు రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2500ల నగదు బహుమతి అందజేశారు. అలాగే మిగిలిన విద్యార్థులకు డిక్షనరీలు, నోటు పుస్తకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ యాకసిరి వెంకటేశ్వర్లు, ఉలవపాడు జెడ్పీటీసీ అరుణ, ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పులి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎంఎస్ పరీక్షకు 1,100 మంది హాజరు



నెల్లూరు (టౌన్) : జిల్లాలో ఎస్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌కు 1,100 మంది విద్యార్థులు హాజరైనట్లు స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీ మదన్‌మోహన్‌లు తెలిపారు. జిల్లాలోని నెల్లూరు, కావలి, వింజమూరు, ఆత్మకూరు ప్రాంతాల్లో ఆదివారం పరీక్షను నిర్వహించామన్నారు. నెల్లూరు డివిజన్‌కు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్‌లో టెస్ట్ నిర్వహించామన్నారు. 212 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. కేఎన్నార్ మున్సిపల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మొదటి నాలుగు స్థానాలు, ధనలక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఐదో స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్ బాబు, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, స్కూల్ హెచ్ఎం కృష్ణారెడ్డి, ఇన్విజిలేటర్లు అంతుమాదేవి, మల్లికార్జునశర్మ, రామ్మోహన్, మోహన్, శ్రీనివాస్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ముగిసిన కార్తీకమాస పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

నెల్లూరు(బృందావనం) : కార్తీక మాసం చివరి రోజు ఆదివారం రాత్రి నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆకాశదీప ఉద్వాసన, పోలీ స్వర్గపూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. దేవస్థానం ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.

- నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆకాశ దీపాల ఉద్వాసన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆలయంలో ఏర్పాటు చేసిన కృత్రిమ కోనేరులో దీపాలను వదిలారు. కార్యక్రమానికి మంజులమ్మ ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, అర్చకుడు సాయి భరద్వాజ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో..

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి మండల పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని భిక్షను స్వీకరించారు. ఉభయకర్తలుగా బి.కృష్ణమూర్తి- ఝాన్సీరాణి, వెంకటేశ్వరనాయుడు- భవాని, రవిచంద్రారెడ్డి- లహరి, మల్లికార్జునరెడ్డి- సుభాషిణి, విశ్వనాథరెడ్డి- హరిప్రియ, కె.వెంకటకృష్ణారెడ్డి- సీతమ్మ దంపతులు వ్యవహరించారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- డీఎంహెచ్ఓ పెంచలయ్య



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు(బృందావనం): సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని డీఎంహెచ్ఓ ఎం.పెంచలయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నెల్లూరులోని గాంధీబొమ్మ నుంచి పురమందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ జరిగిన సభలో పెంచలయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎయిడ్స్‌ను తుదముట్టించాలన్న సంకల్పంతో ఈ ఏడాది ‘టేక్ ది రైట్స్ పాత్’ నినాదాన్ని ప్రకటించారన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలీ మాట్లాడుతూ జిల్లాలో కేసుల తీవ్రత బాగా తగ్గిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, అర్బన్ సెంటర్లలో, ఐసీటీసీల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వ్యాధి ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేసి వారి హక్కులను కాపాడతామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రమేష్‌నాయక్, హెచ్ఓడీ గైనకాలజీ గీతాలక్ష్మి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖలో ఉత్తమ సేవలందించిన వారికి జ్ఞాపికలు, పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఎయిడ్స్‌ను అరికడుదాం

నెల్లూరు(అర్బన్) : ఎయిడ్స్ మహమ్మారిని పూర్తి స్థాయిలో అరికట్టాలని సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బుజబుజనెల్లూరులోని సింహపురి స్కూల్‌లో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటిస్తూ మంచి మార్గంలో నడవాలన్నారు. అనంతరం పిల్లలకు తినుబండారాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల బాధ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

ఆర్టీసీ బస్టాండ్‌లో ఐఈసీ స్టాల్

నెల్లూరు(అర్బన్) : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సుఖ వ్యాధులు, హెచ్ఐవీ, రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఐఈసీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఆర్టీసీ డిపో మేనేజర్ మురళి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచి అలవాట్లను వివరిస్తూ మెటీరియల్ అందుబాటులో ఉంచామన్నారు. ఈ శిబిరంలో హెచ్ఐవీ రక్త పరీక్షలు కూడా చేస్తారని తెలిపారు. వారం రోజుల పాటు ఈ శిబిరం ఉంటుందన్నారు.



స్టాల్ ప్రారంభోత్సవంలో అధికారులు

జడివాన

ఫెంగల్ తుఫాన్ తీరం దాటిన తరువాత నెల్లూరు నగరంలో ఆదివారం విడతల వారీగా జడివాన కురిసింది. అయితే పలు ప్రాంతాల్లో జోరు వర్షం పడింది. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమైంది. ప్రధాన రోడ్లలో వర్షపు నీరు నిల్వ చేరింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు



కనకమహల్ సెంటర్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు





జోరు వర్షంలోనూ బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న మహిళలు



ట్రంకు రోడ్డులో కురుస్తున్న జోరు వర్షం